క్లుప్తంగా

ప్రథమ చికిత్సపై కార్మికులకు అవగాహన



తెనాలి: రెడ్‌క్రాస్ సొసైటీ, తెనాలి శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక సుల్తానాబాద్‌లోని కుమార్ పంప్స్ ఆవరణలో ప్రథమ చికిత్సపై అవగాహన కల్పించారు. గుండెపోటు సంభవించినపుడు ప్రథమంగా చేయాల్సిన చికిత్స గురించి జిల్లా రెడ్‌క్రాస్ వైద్యాధికారి, పేరేచర్లలోని కమలా నర్సింగ్ హోమ్ అధినేత డాక్టర్ లక్ష్మీసుశీల కార్మికులకు శిక్షణనిచ్చారు. కొత్తగా వచ్చిన సిబ్బందికి ప్రథమ చికిత్సపై ఏటా అవగాహన కల్పిస్తున్నామని, ఇందుకు సహకరిస్తున్న రెడ్‌క్రాస్ బాధ్యులకు కుమార్ పంప్స్ అధినేత కొత్త సుబ్రహ్మణ్యం ధన్యవాదాలు తెలిపారు. రెడ్‌క్రాస్ సొసైటీ ఫస్ట్ ఎయిడ్ కన్వీనర్ జాని, రెడ్‌క్రాస్ తెనాలి చైర్‌పర్సన్ ముమ్మనేని భానుమతి, కోశాధికారి నాళం శ్రీమన్నారాయణమూర్తి, కిరణ్, ఫణి తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోండి



తెనాలిఅర్బన్: దోమల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాల్లో చర్యలు తీసుకోవాలని తెనాలి అసిస్టెంట్ మలేరియా అధికారి చరసాని ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మలేరియా విభాగం ఆధ్వర్యంలో పట్టణంలోని లక్ష్మీనగర్, పినపాడులో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వలన దోమలను నిర్మూలించుకోవచ్చని చెప్పారు. దోమకాటు వలన మలేరియా, ఫైలేరియా, డెంగీ, చికెన్ గున్యా, మెదడువాపు వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. ఫ్రైడేన్ డ్రైడేగా పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్, ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, మలేరియా సూపర్‌వైజర్ దీపాల శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

చిరు వ్యాపారి ఆత్మహత్యాయత్నం

మున్సిపల్ అధికారులు వేధిస్తున్నారంటూ ఆరోపణ

తెనాలిరూరల్: మున్సిపల్ అధికారులు వేధిస్తున్నారంటూ చిరు వ్యాపారి కుటుంబసభ్యులతో కలసి ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. తోపుడు బండిపై టిఫిన్ అమ్ముకునే తమను రాజకీయ ఒత్తిళ్ల కారణంగా వేధింపులకు గురిచేస్తున్నారంటూ పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేసింది. తెనాలి శివాజీచౌక్ కూడలిలో పట్టణానికి చెందిన నాదెండ్ల లక్ష్మీ సుజాత తన కుటుంబ సభ్యులతో కలసి టిఫిన్ బండి నిర్వహిస్తోంది. బండి అక్కడ నుంచి తీసి 20 అడుగుల దూరంలో పెట్టుకోవాలని మున్సిపల్ అధికారులు గురువారం వారికి చెప్పారు. అయినా శుక్రవారం పాత ప్రదేశంలోనే బండి పెట్టడంతో మున్సిపల్ సిబ్బంది బండిని కార్యాలయానికి తరలించారు. లక్ష్మీసుజాత, కుటుంబసభ్యులు రోడ్డుపై బైఠాయించి ఆందోళనకు దిగారు. పోలీసులు వచ్చి ఆందోళన విరమించాలని సర్ది చెబుతున్న క్రమంలో వీరు ఒంటిపై పెట్రోలు పోసుకునేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం స్టేషన్‌కు తరలించి కౌన్సెలింగ్ ఇచ్చారు.

డాక్టర్ హరిప్రసాదరావుకు ఘన నివాళి



తెనాలిరూరల్: పట్టణానికి చెందిన డాక్టర్ గోగినేని హరిప్రసాదరావు జయంతిని పురస్కరించుకుని వైద్యులు ఘనంగా నివాళులర్పించారు. స్థానిక బోస్‌రోడ్డులోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాలులో ఏర్పాటు చేసి హరిప్రసాదరావు చిత్రపటానికి పలువురు వైద్యులు, కుటుంబసభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైద్యుడిగా హరిప్రసాదరావు అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఆయన కుమారుడు డాక్టర్ లక్ష్మీప్రసాద్, కోడలు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోగినేని ఉమ, డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ పావని, డాక్టర్ అనిల్‌కుమార్, డాక్టర్ శ్యామ్‌ప్రసాద్, డాక్టర్ ప్రభాకర్‌బాబు పాల్గొన్నారు.

నేడు అయ్యప్ప పడి పూజ

పాతగుంటూరు: అరండల్‌పేట ఏడో లైనులోని రామచంద్ర బ్రదర్స్ మెగా ఫర్నీచర్ షోరూం ఆవరణలో శనివారం అయ్యప్పస్వామి పడి పూజ మహోత్సవం వైభవంగా నిర్వహించనున్నట్లు సంస్థ అధినేత పుష్పాల సుబ్బారావు ప్రకటనలో తెలిపారు. రాత్రి 7 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో శ్రీనివాసన్ నాయర్ నిర్వహణలో అభిషేకాలు జరుగుతాయని పేర్కొన్నారు. దప్పు శ్రీను బృందంతో భజన ఉంటుందని తెలిపారు.

సంక్షేమం, అభివృద్ధికి పెద్ద పీట

- మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక
- 8,26 వార్డుల్లో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం



8వ వార్డులో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు అవసరం అనే బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న చైర్‌పర్సన్ రాధిక

తెనాలిఅర్బన్: సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని 8వ వార్డు కొత్తపేట-2 సచివాలయం వద్ద శుక్రవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్‌కు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. గత పాలకులు రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టివేశారని విమర్శించారు. తమ ప్రభుత్వం వచ్చిన తరువాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ప్రథమస్థానంలో ఉంచారని చెప్పారు. ఒక వైపు పెద్దఎత్తున సంక్షేమాన్ని అందిస్తూ అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ప్రజలు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. 8వ వార్డులో ఇప్పటి వరకు రూ.17.95కోట్ల సంక్షేమాన్ని అందించినట్లు చెప్పారు. అనంతరం సచివాలయంలో ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాల లబ్ధిదారుల వివరాలు తెలియజేసే బోర్డులను, జగన్ ఆంధ్రప్రదేశ్‌కు ఎందుకు అవసరం అనే బుక్‌లెట్‌ను చైర్‌పర్సన్ ఆవిష్కరించారు. సమావేశంలో కౌన్సిలర్ తోట రఘురామ్, మేనేజర్ అప్పలరాజు, డీఈ నాగభూషణం, వైఎస్సార్‌సీపీ తెనాలి పట్టణ క్లస్టర్-1 అధ్యక్షుడు మద్దాళి శేషాచలం, వైఎస్సార్ సీపీ నాయకులు తాడిబోయిన రమేష్, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

-26వ వార్డు పాండురంగపేట సచివాలయం వద్ద వైఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని తెలియజేశారు. 26వ వార్డులో ఇప్పటి వరకు రూ.17.84 కోట్లతో సంక్షేమాన్ని అందించినట్లు చెప్పారు. అనంతరం సచివాలయంలో ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాల లబ్ధిదారుల వివరాలు తెలియజేసే బోర్డులను, జగన్ ఆంధ్రప్రదేశ్‌కు ఎందుకు అవసరం అనే బుక్‌లెట్‌ను ఆమె ఆవిష్కరించారు. సమావేశంలో కౌన్సిలర్ షేక్ ఇస్మాయేల్, తాడిబోయిన రామయ్య, వైఎస్సార్‌సీపీ తెనాలి పట్టణ క్లస్టర్-2 అధ్యక్షుడు షేక్ దుబాయ్‌బాబు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రతి హామీ నెరవేర్చిన ఘనత జగనన్నదే

పిడపర్రు(కొల్లిపర): ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎంపీపీ భీమవరపు పద్మావతిసంజీవరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అవుతు పోతిరెడ్డి అన్నారు. మండలంలోని పిడపర్రు గ్రామ సచివాలయంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన కూడలిలో వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు పార్టీ జెండా ఎగురవేశారు. సచివాలయంలో సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. మండల కన్వీనర్ పోతిరెడ్డి మాట్లాడుతూ పార్టీలు, కులమతాలకతీతంగా అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని తెలిపారు. అటువంటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను మళ్లీ గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. అనంతరం పార్టీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, గృహసారథులు ఇంటింటికి తిరుగుతూ జగనన్న పాలనలో చేపట్టిన సంక్షేమం, అభివృద్ధిని వివరించే బుక్‌లెట్స్, కరపత్రాలను ప్రజలకు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ దూరు రత్నబాబు, పిడపర్తిపాలెం సర్పంచ్ బొల్లు కరుశ్రీ, ఎంపీడీవో విజయలక్ష్మి, ఈవోపీఆర్డీ పూర్ణశంకరరావు, ఏవో వి.చంద్రమోహన్, సీనియర్ అసిస్టెంట్ భీమవరపు మధుసూదనరెడ్డి, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

తెనాలిటౌన్: రూరల్ మండలం కొలకలూరు గ్రామంలో సచివాలయం-2 పరిధిలో శుక్రవారం 'పల్లెకు పోదాం' కార్యక్రమాన్ని నిర్వహించారు. సచివాలయం ఆవరణలో అభివృద్ధి పథకాల బోర్డును ఎంపీపీ ధర్మరాజుల చెన్నకేశవులు ఆవిష్కరించారు. అనంతరం ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. సచివాలయంలో జరిగిన సభకు మాజీ ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు.



పిడపర్రులో సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న కన్వీనర్ పోతిరెడ్డి, ఎంపీపీ పద్మావతి



కరపత్రాలు అందజేస్తున్న ఎంపీపీ చెన్నకేశవులు

సభలో ఎంపీపీ చెన్నకేశవులు మాట్లాడుతూ సచివాలయ పరిధిలో రూ.57కోట్లతో సంక్షేమ పథకాల కింద లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేశామన్నారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలు ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో వి.ప్రతాపరెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు చెక్కా సీతమ్మ, పంచాయతీ కార్యదర్శి కల్పన, సిసి వెంకటేశ్వరరావు, వైస్సార్ సీపీ నాయకులు పినపాటి అనిల్, కొలకలూరి నాగేశ్వరరావు, రావూరి రవిబాబు, వీరమల్లు కార్తికేయ, పిఆర్ ఏఇ ఎం.వెంకటేశ్వరరావు, హౌసింగ్ ఏఈ శ్రీనివాస్, సచివాలయ సెక్రటరీ రత్నకుమార్, వెల్ఫేర అసిస్టెంట్ త్రివేణి, వీఆర్వో సురేష్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయండి

మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక



తెనాలిఅర్బన్: పట్టణంలోని 13వ వార్డులో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక ఇంజినీరింగ్ అధికారులకు ఆదేశించారు. 13వ వార్డులో శుక్రవారం ఉదయం ఆమె పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. వార్డులో నిలిచిపోయిన అభివృద్ధి పనులపై ఆరా తీశారు. వార్డులో నెలకొన్న సమస్యలను వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ కుర్రా సుజాత ఆమెకు తెలియజేశారు. ఆమె వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు కుర్రా శ్రీను, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు దావులూరి శ్రీనివాసరావు, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

కరాటే పోటీల్లో బంగారు పతకాలు



తెనాలిఅర్బన్: జాతీయస్థాయిలో జరిగిన కరాటే పోటీల్లో తెనాలి దేవిచౌక్ సమీపంలోని న్యూ మాంక్స్ కుంగ్‌ఫు అకాడమికి చెందిన ఏడుగురు బంగారు పతకాలు సాధించినట్లు కోచ్ జానీ తెలిపారు. పోటీలను గత నెల 26వ తేదీన చిలకలూరుపేటలో నిర్వహించినట్లు చెప్పారు. శుక్రవారం అకాడమీ ఆవరణలో పతకాలు సాధించిన విద్యార్థులను అభినందించారు.

జాగ్రత్తలు పాటించకుంటే అనర్థం తప్పదు

- జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవతి
- పలుచోట్ల ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీలు
- ఏఆర్‌టీ విభాగంలో రోగులకు రొట్టెల పంపిణీ

తెనాలి: జాగ్రత్తలు పాటించకపోతే అనర్థం తప్పదని స్థానిక జిల్లా ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యరాణి అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం రెడ్‌క్రాస్ సొసైటీ, తెనాలి శాఖ ఆధ్వర్యంలో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలోని ఏఆర్‌టీ విభాగంలోని రోగులకు రొట్టెలు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ హెచ్‌ఐవీ/ ఎయిడ్స్ సంక్రమణ కారణాలను వివరించారు. ఆసుపత్రి ఆర్ఎంఓ డాక్టర్ మస్తాన్, డాక్టర్ స్నేహశ్రీ, రెడ్‌క్రాస్ గుంటూరు జిల్లా కన్వీనర్ జానీ, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లక్ష్మీసుశీల, తెనాలి శాఖ చైర్‌పర్సన్ ముమ్మనేని భానుమతి, కోశాధికారి నాళం శ్రీమన్నారాయణ మూర్తి, ఫణి, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఏఎస్ఎన్ ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో...

ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం స్థానిక బుర్రిపాలెంరోడ్డులోని ఏఎస్ఎన్ ఫార్మసీ కాలేజి ఆధ్వర్యంలో రూరల్ మండలం ఆటోనగర్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.



మాట్లాడుతున్న డాక్టర్ సౌభాగ్యవాణి

హెచ్‌ఐవీ/ఎయిడ్స్ నివారణపై ప్రదర్శన నిర్వహిస్తూ, అవగాహన కరపత్రాలను పంపిణీ చేశారు. ఎయిడ్స్ దినోత్సవం ప్రాధాన్యతపై కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ మాట్లాడారు. ఎయిడ్స్‌కు ఇప్పటివరకు తగిన వాక్సిన్ లేదా మందును కనుగొనలేదని గుర్తుచేశారు. వ్యాధి రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవటమే ముఖ్యమని చెప్పారు. కాలేజి ఎన్ఎస్ఎస్ విభాగం ప్రోగ్రాం అధికారులు డాక్టర్ టి.జ్యోతిబసు, కళ్యాణచక్రవర్తి, ఐపీఏ ఏఎస్ఎన్ మెంటార్ ఫణికృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఆటోనగర్‌లో ఫార్మసీ విద్యార్థుల ప్రదర్శన

జేఎంజే మహిళా కళాశాలలో...

స్థానిక జేఎంజే మహిళా కాలేజిలో శుక్రవారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని జరిపారు. రెడ్‌రిబ్బన్ సింబల్‌ను చిత్రీకరించి విద్యార్థినులకు అవగాహన కల్పించారు. కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైనీ మాట్లాడుతూ సమాజం అంటే ఏమిటో తెలియజేసి, ఆడపిల్లలు జాగ్రత్తగా మెలిగినపుడే సమాజం అభివృద్ధి చెందుతుందని, వారి ద్వారానే ఏదైనా సాధించగలమని చెప్పారు. హెచ్‌ఐవీ/ఎయిడ్స్ లక్షణాలు, ఎలా సంక్రమిస్తుందీ, ఎలాంటి జాగ్రత్తలు పాటించాలి అనే అంశాలను రెడ్‌రిబ్బన్ కన్వీనర్ డాక్టర్ నిర్మల జ్యోతి వివరించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ అరుణ సుజాత, కాలేజి వైస్‌ప్రిన్సిపాల్ సిస్టర్ మేరీ శారద, డాక్టర్ సిస్టర్ అమూల్‌మేరి, యూత్ రెడ్‌క్రాస్ కన్వీనర్ పాటిబండ్ల హేమలత పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాపై అవగాహన సదస్సు

తెనాలిటౌన్: గ్రామ పంచాయతీ కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయంలో ఉన్న ఓటర్ల జాబితాలను తనిఖీచేసి, తమ పేరు ఉందో, లేదో చూసుకోవాలని కాంగ్రెస్ పార్టీ తెనాలి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చందు సాంబశివుడు ప్రజలను కోరారు. మారీసుపేటలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఓటర్ జాబితాపై అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ సాంబశివుడు మాట్లాడుతూ పార్టీ నాయకులు గ్రామాల్లో ఓటర్ల జాబితాపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఓటరు జాబితాలో పేరు లేకపోయినట్లయితే బీఎల్‌వోలను సంప్రదించి పేరు నమోదు చేసుకోవడానికి అర్జీలు పెట్టాలని కోరారు.

సదస్సులో పార్టీ పట్టణ అధ్యక్షుడు పొన్నూరు సూర్యశేఖరరావు, మండల పార్టీ అధ్యక్షుడు కె.బుల్లయ్య, నాయకులు డి.శ్రీనివాసరావు, పి.శివకుమార్, ఎం.పూర్ణచంద్రరావు, రమేష్, షేక్ మాబు, రాయప్ప, తన్నీరు శివన్నారాయణ, ఎల్లమంద, బి.శ్రీను, కె.వీరాస్వామి, నాయన మల్లికార్జునరావు పాల్గొన్నారు.

నేడు సంగీత కళాకారుల సంఘం వార్షికోత్సవం

పాత గుంటూరు: అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజం ఆడిటోరియం వేదికగా గుంటూరు జిల్లా సంగీత కళాకారుల సంఘం 12వ వార్షికోత్సవంతో పాటు డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి ఉత్సవాలను శనివారం నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు మద్దు వెంకటస్వామి ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 5 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో కన్నా మాస్టారు, సంగీత గురువులు ఎం.ఎస్.బాబులను పురస్కారాలతో సత్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం సినీ సంగీత విభావరి జరుగుతుందని, కళాభిమానులు పాల్గొనాలని ఆయన కోరారు.

మందుబాబులపై కేసు



తెనాలిరూరల్: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న వారి రూరల్ పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి కేసులు నమోదు చేశారు. తెనాలి మండలం తేలప్రోలు, సోమసుందరపాలెం గ్రామాల మధ్య బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడంతో పాటు సీసాలను పగులగొట్టి పొలాల్లో పడేస్తున్నారని ఫిర్యాదుల నేపథ్యంలో రూలర్ ఎస్ఐ సీహెచ్ వెంకటేశ్వర్లు తన సిబ్బందితో కలసి శుక్రవారం రాత్రి ఆయా ప్రాంతాల్లో గస్తీ నిర్వహించారు. మద్యం తాగుతున్న నలుగురిని గుర్తించారు. వారికి కౌన్సెలింగ్ ఇవ్వడంతో పాటు కేసులు నమోదు చేశారు.

వైభవంగా అక్కినేని ప్రతిభా పురస్కారాలు ప్రదానం



పురస్కార గ్రహీతలతో అతిథులు, నిర్వాహకులు

పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి పురస్కరించుకుని సాంస్కృతిక బంధు సారిపల్లి కొండలరావు సారథ్యంలో శుక్రవారం యువకళావాహిని నిర్వహణలో అక్కినేని ప్రతిభా పురస్కారాల ప్రధానోత్సవం సభ నిర్వహించారు. యువ కళావాహిని అధ్యక్షుడు లంక లక్ష్మీనారాయణ సభకు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్, మాజీ స్పీకర్ మండలి బుద్ధప్రసాద్, న్యాయమూర్తి నేలపూడి చిరంజీవి, ఏపీపీఎస్ఎస్ఏటీ డెప్యూటీ చైర్మన్ బి. రామారావు, న్యాయవాది వరప్రసాద్, దర్శకులు కావూరి సత్యనారాయణ, ఆలయ అధ్యక్షుడు సీహెచ్. మస్తానయ్య పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాల్ని ప్రారంభించారు. చిరస్మరణీయుడైన డాక్టర్ అక్కినేనిని స్మరించుకుంటూ కళాకారులకు ప్రతిభా పురస్కారాల్ని అందిస్తున్న సంస్థను అభినందించారు. ఈ సందర్భంగా సినీ నటుడు అశోక్ కుమార్, దర్శకుడు సీహెచ్. రజిత మూర్తి, ప్రముఖ వీణా విద్వాంసురాలు ఏ. భారతీదేవి, టీవీ నటులు విడుదల సాంబశివరావు, పి. సూరిబాబు, పద్య కవి ఐనాల మల్లేశ్వరరావు, కళాకారుడు ఎస్.వి. రామారావును పురస్కారాలతో సత్కరించారు. అనంతరం అతిథుల్ని సంస్థ నిర్వాహకులు సత్కరించారు. అక్కినేని పాటలను వీణపై రామరాజు లక్ష్మీ శ్రీనివాస్ శ్రావ్యంగా వినిపించారు. అనంతరం అక్కినేని జైత్రయాత్ర డాక్యుమెంటరీ ప్రదర్శన ప్రేక్షకుల్ని ఆకట్టుకుంది. కార్యక్రమాల్ని లయన్ ఎం.ఏ. హమీద్, డి. తిరుమలేశ్వరరావు, సయ్యద్ జానీ బాషా, కె. రాధాకృష్ణ పర్యవేక్షించారు.

వరసిద్ధి వినాయక ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

పాత గుంటూరు: మాతృశ్రీ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో హౌసింగ్ బోర్డ్ కాలనీలో నూతనంగా నిర్మించనున్న శ్రీ వరసిద్ధి వినాయక సహిత శ్రీ గౌరీ కేదారేశ్వర దేవాలయ శంకుస్థాపన మహోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. తాళ్లాయపాలెం శ్రీశైవ క్షేత్ర పీఠాధిపతులు శ్రీ శివస్వామి పాల్గొని భూమిపూజ చేశారు. తొలుత ప్రధాన అర్చకులు కొండూరి మల్లికార్జునశాస్త్రి నేతృత్వంలో నడింపల్లి జానకీ శైలజ విజయప్రసాద్, చాపవరపు అనంత లక్ష్మీ గోపాలరెడ్డి దంపతులతో వేదపండితులు శాస్త్రయుక్తంగా పూజలు, హోమాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పశ్చిమ శాసనసభ్యులు మద్దాలి గిరిధర్ పాల్గొన్నారు. శివస్వామి అనుగ్రహ భాషణం చేస్తూ కార్తికమాసం పార్వతీ పరమేశ్వరులకు అత్యంత ప్రీతిపాత్రమని తెలిపారు. వరసిద్ధి వినాయక సహిత శ్రీగౌరీ కేదారేశ్వరస్వామి వార్ల దేవస్థానం త్వరితగతిన పూర్తి చేసుకొని విశేష పుణ్యక్షేత్రంగా వర్ధిల్లుతుందని ఆశీస్సులు అందజేశారు. ట్రస్టీ నడింపల్లి విజయ్ ప్రసాద్ మాట్లాడుతూ దాతల సహకారంతో దేవాలయంతో పాటు గోశాల, వృద్ధాశ్రమం, వేద పాఠశాల నిర్మించనున్నట్లు తెలియజేశారు. కోట సత్యనారాయణ, గూడూరు వెంకటేశ్వరరావు, గుండు సుబ్రహ్మణ్యం, కటకంశెట్టి కోటేశ్వరరావు, వణుకూరి సాంబిరెడ్డి, భక్తులు పాల్గొన్నారు

తెలుగు సాహిత్య కళా ఉత్సవాలకు ప్రజ్ఞాచారికి ఆహ్వానం

తెనాలిటౌన్: శ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఈ నెల 16,17 తేదీల్లో పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో నిర్వహిస్తున్న తెలుగు సాహిత్య కళా ఉత్సవాల్లో పాల్గొనేందుకు రూరల్ మండలం కొలకలూరుకు చెందిన సాహితీ రత్న నూతక్కి పూర్ణప్రజ్ఞాచారికి ఆహ్వానం వచ్చినట్లు ప్రజ్ఞాచారి శుక్రవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రపంచస్థాయి తెలుగు సాహిత్య సభల్లో పాల్గొనడం మూడోసారిగా చెప్పారు. సాహితీ సభల్లో నేను సమర్పించే కవిత్వం విలువలే నాకు ఇటువంటి తెలుగు సభల్లో పాల్గొనేందుకు ఆహ్వానాలు అందుతున్నాయన్నారు. పలువురు కళాకారులు, గ్రామ పెద్దలు ప్రజ్ఞాచారి అభినందనలు తెలిపారు.

పసుపు వేలము ప్రకటన

బాపట్ల జిల్లా భట్టిప్రోలు మండలం భట్టిప్రోలు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్ నందు ఈ దిగువ తెల్పిన రైతులు పసుపును హామీగా వుంచి ఋణము పొందియున్నారు. వారి యొక్క ఋణము వాయిదా మీరినది. వారికి ఎన్ని పర్యాయములు నోటీసులు ఇచ్చినను ఋణము చెల్లించనందున వారి యొక్క పసుపును ఈ దిగువ ఉదహరించిన విధముగా సహకార సంఘముల చట్టం ప్రకారము వేలము వేయబడును అని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

ది.04-12-2023 ఉదయం 11.30 లకు, దుగ్గిరాల గ్రామములో

S.No	G.No.	NAME	L.No.	QTS	DATE OF DISBURS	AMOUNT	STOCK PLACE
1	300బి	పొన్నెగంటి నరేంద్ర తండ్రి బాపయ్య వేల్పూరు	858	105	29.05.2018	500000	శ్రీ విజయలక్ష్మి అన్నపూర్ణ కోల్డ్ స్టోరేజ్, దుగ్గిరాల
2	808బి	ఈపూరి ఏసురత్నం తండ్రి సామియేలు-అన్నవరపులంక	929	21	30.07.2019	60000	ఉమా మహేశ్వర కోల్డ్ స్టోరేజ్ దుగ్గిరాల
3	845బి	కోన వెంకటేశ్వరరావు తండ్రి బ్రహ్మయ్య, కొల్లూరు	1487	231	22.08.2019	880000	సెంట్రల్ వేర్ హౌస్ వడ్లమూడి
4	971బి	బిరుదుగడ్డ చిన్న జక్రయ్య తండ్రి ఆనందరావు-కుంచవరపల్లి	1488	270	26.06.2020	1000000	ఉమా మహేశ్వర కోల్డ్ స్టోరేజ్ దుగ్గిరాల
5	771బి	బిరుదుగడ్డ ప్రసాద్ తండ్రి విజయేంద్రరావు-కుంచవరపల్లి	1489	267	26.06.2020	1000000	ఉమా మహేశ్వర కోల్డ్ స్టోరేజ్ దుగ్గిరాల
6	817బి	దారం కోటేశ్వరరావు తండ్రి పుల్లయ్య- దుగ్గిరాల	1490	241	26.06.2020	900000	ఉమా మహేశ్వర కోల్డ్ స్టోరేజ్ దుగ్గిరాల

షరతులు : 1) పాటలో పాల్గొనవలసిన వారు వేలము సమయమునకు ముందుగా రూ.5000/-లు ధరావత్తు చెల్లించి పాల్గొనవలెను. 2) పాట పాడుకున్న వారు సొమ్ము రూ.500000/-అదేరోజున చెల్లించి మిగిలిన మొత్తమును సరుకును స్వాధీనపరుచుకున్నరోజున చెల్లించవలెను. 3) పాటను జరుపుటకు మరియు నిలుపుదల చేయుటకు సంఘ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు గారికి పూర్తి అధికారము ఉన్నది. 4)పూర్తివివరముల కొరకు సంఘ ఆఫీసు పనివేళల యందు సంఘ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు గారిని సంప్రదించవలెను.

సం/- చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, PACS, భట్టిప్రోలు

ప్రారంభమైన సామాజిక పింఛన్ల పంపిణీ



ఐతానగర్‌లో కోటేశ్వరమ్మకు వృద్ధాప్య పింఛన్ అందిస్తున్న వెల్ఫేర్ సెక్రటరీ అనీల్‌ప్రసాద్



చినరావూరుతోటకు చెందిన చినవెంకటేశ్వర్లుకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ దేవసహాయం



మారీసుపేటకు చెందిన జయలక్ష్మికి వృద్ధాప్య పింఛన్ అందజేస్తున్న భ్రమరాంబ

తెనాలిఅర్బన్: తెనాలి పట్టణంలో వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. ఉదయం నుంచి వార్డు వలంటీర్‌లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి నగదు పంపిణీ చేశారు. లబ్ధిదారులు కొందరు వివిధ ఆస్పత్రులలో ఉండటంతో అక్కడికి వెళ్లి నగదు అందజేశారు. తెనాలి ఇస్లాంపేటకు చెందిన నీళ్లపూడి గోవిందమ్మ అనారోగ్యంతో గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతుండగా విషయం తెలుసుకున్న పఠాన్ అయూబ్‌ఖాన్ అక్కడి వెళ్లి ఆమెకు వృద్ధాప్య పింఛన్ అందజేశారు. ఐతానగర్‌కు చెందిన గుండి కోటేశ్వరమ్మకు వృద్ధాప్య పింఛన్‌ను వెల్ఫేర్ సెక్రటరీ ఎ.అనిల్‌ప్రసాద్ అందజేశారు. మారీసుపేటకు చెందిన మోర జయలక్ష్మికి, చినరావూరు తోటకు చెందిన గరిక చినవెంకటేశ్వర్లుకు వృద్ధాప్య పింఛన్లను ఆయా వార్డుల వలంటీర్లు కె.భ్రమరాంబ, దేవసహాయం అందజేశారు.



గుంటూరు జీజీహెచ్‌లో గోవిందమ్మకు వృద్ధాప్య పింఛన్ అందిస్తున్న వలంటీర్ అయూబ్‌ఖాన్

కట్నం వేధింపులపై కేసు నమోదు

తెనాలిరూరల్: వరకట్న వేధింపులపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ చినరావూరుకు చెందిన శ్రీలక్ష్మికి బాణావత్ విష్ణుతో వివాహమైంది. కొద్ది కాలంగా పుట్టింటి నుంచి అధిక కట్నం తీసుకురమ్మంటూ భర్త వేధిస్తున్నాడని బాధితురాలు పోలీసులను ఆశ్రయించగా వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.